RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in  rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 283 | 4 శుక్రవారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## స్థానిక ఎన్నికలపై లోకేశ్ స్పష్టత..

**- అక్టోబర్‌కే పూర్తి ప్రక్రియ**

- స్థానిక ఎన్నికల వాయిదాకు అవకాశం లేదన్న మంత్రి
- వైసీపీ 'గొడ్డలి రాజకీయాలు' సాగవని విమర్శ
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచన



**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 3 :** రాష్ట్ర మంత్రులతో విద్యాశా ఖ మంత్రి నారా లోకేశ్ గురువారం కీలక సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియ, వివిధ శాఖల పనితీరు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, అర్హత కలిగిన వారికి పారదర్శకంగా లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు. సంక్షేమ కార్యక్రమా ల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం చోటు మిగతా 2లో..

## అభిమాని కోరిక తీర్చిన వైయస్ జగన్

- బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న యువకుడికి ఆత్మీయ పరామర్శ
- ఒక్కసారి కలవాలన్న ఆకాంక్షను నెరవేర్చిన వైఎస్ఆర్‌సీపీ అధినేత
- మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ చొరవతో జరిగిన భేటీ
- ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చిన జగన్



**రాజధాని వాయిస్ కర్నూలు :** బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తన వీరాభి మాని కోరికను వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మో హన్‌రెడ్డి నెరవేర్చారు. కర్నూలుకు చెందిన విశ్వనాథ్ గత కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతూ చికిత్స పొందుతున్నాడు. వైయస్ జగన్‌కు వీరాభిమాని అయిన అతడు జీవితంలో ఒక్కసారైనా తన అభిమాన నాయకుడిని కలవాలని, ఆయనతో ఫొటో దిగాలని ఎంతోకాలంగా కోరుకుంటున్నాడు. ఈ విషయం పార్టీ నాయకుల ద్వారా జగన్ దృష్టికి చేరడంతో ఆయన వెంటనే స్పందించారు. కర్నూలు పర్యటనకు వచ్చిన సందర్భంగా విశ్వనాథ్‌ను వైయస్ జగన్‌ను కలిసేలా ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ చొరవ తీసుకుని విశ్వనాథ్‌ను జగన్ వద్దకు తీసుకెళ్లారు. తన అభిమాన నాయకుడిని ప్రత్యక్షంగా చూసిన విశ్వనాథ్ భావోద్వేగానికి గురయ్యాడు. ఎంతోకాలంగా మనసులో పెట్టుకున్న కోరిక నెరవేరడంతో ఆనందం వ్యక్తం చేశాడు. విశ్వనాథ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైయస్ జగన్ ఆరా తీశారు. అతనితో కొంతసేపు ఆప్యాయంగా మిగతా 2లో..

## నన్ను బెదిరిస్తే భయపడను

**- సీఎం రేవంత్‌రెడ్డి**



**రాజధాని వాయిస్ హైదరాబాద్ :** తననెవరూ బెదిరించవద్దని.. బెదిరిస్తే భయపడనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాతబస్తీలోని నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించిన భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను సీఎం ప్రారంభిం చారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొని మాట్లాడారు. "బెదిరిస్తే భయపడను. స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే గులామ్ ను. ఎన్నికలు వస్తుంటాయి.. మిగతా 2లో..

## మాక్స్ స్మార్ట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించిన అమిత్ షా

- ఢిల్లీలోని సాకేత్‌లో కొత్త వైద్య సదుపాయాల ప్రారంభం
- 25 ఏళ్ల సేవా ప్రయాణంలో మరో మైలురాయి
- గత ఏడాదిలో లక్షల మందికి ఉచిత వైద్య సేవలు
- మరింత మందికి నాణ్యమైన వైద్యం అందుబాటులోకి



**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ** కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీలోని సాకేత్ ప్రాంతంలో మాక్స్ స్మార్ట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నూతన భవనాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి సంస్థ గత 25 ఏళ్లుగా విశిష్ట సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. కొత్త భవనం ప్రారంభం ఆసుపత్రి సేవా ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. గత ఏడాది కాలంలోనే ఈ ఆసుపత్రి సంస్థ సుమారు 3.60 లక్షల మందికి అత్యాధునిక వైద్య సేవలను ఉచితంగా అందించి ందని అమిత్ షా తెలిపారు. ఈ సేవల విలువ రూ.244 కోట్లకు పైగా ఉంటుందని వెల్లడించారు. సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు వైద్య సేవలు అందిం చడంలో ఆసుపత్రి నిర్వహణ చూపుతున్న చొరవ ప్రశంసనీయమని- మిగతా 2లో..



## 31 కీలక అజెండాలకు ఏపీ కేబినెట్ ఆమోదం

- రైతులు, మత్స్యకారులు, అమరావతి అభివృద్ధికి కీలక నిర్ణయాలు
- తోతాపురి మామిడి, పొగాకు రైతులకు ఆర్థిక చేయూత
- సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక రంగాల ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్

**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 3 :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 31 కీలక అజెండా అంశాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయం, మత్స్యరంగం, సాగునీరు, విద్యుత్, అమరావతి అభివృద్ధి, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే పలు ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైతులకు ఆర్థిక చేయూత అందించే అంశంపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. తోతాపురి మామిడి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా రూ.281 కోట్ల నిధులు సమకూర్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. - మిగతా 2లో..

## ఎ.కొండూరుకు స్వచ్ఛ జలాల వరం..

**కిడ్నీ బాధితులకు కొత్త ఆశలు**

- జల్ జీవన్ మిషన్--అమరజీవి జలధారలతో తాగునీటి సమస్యకు పరిష్కారం
- రూ.49.94 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పూర్తి
- దాదాపు 75 వేల మందికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా



**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 03 :** ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండల ప్రజల దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించే లా జల్ జీవన్ మిషన్--అమరజీవి జలధారల నిధులతో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు పూర్తయింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రూ.49.94 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది కుటుంబా లకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వచ్చింది. ఎ.కొండూరు మండల పరిధిలో 21 గ్రామ పంచాయతీలు, 38 ఆవాసాలు ఉండగా, చాలా ప్రాంతాలు దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి - మిగతా 2లో..

## న్యాయపోరాటం చేయను.. మరణశిక్ష విధించండి: యాసిన్ మాలిక్

**రాజధాని వాయిస్ :** కశ్మీరీ పండిత్ మహిళ సరళా భట్ హత్య కేసులో తనకు ఎలాంటి ప్రమేయం లేదని, తాను నిందితుడిని కాదని నిషేధిత జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (JKLF) చీఫ్ మహమ్మద్ యాసిన్ మాలిక్ పేర్కొన్నాడు. అయితే, ఈ కేసులో న్యాయపో రాటం చేయబోనని, బదులుగా తనకు మరణశిక్ష విధించాలంటూ శ్రీనగర్‌లోని ప్రత్యేక కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాడు. అదే సమయంలో భార్యతో వివాహ బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటించాడు. యాసిన్ మాలిక్ ప్రస్తుతం దిల్లీలోని తిహాడ్ జైలులో ఉన్నాడు. 1990 ఏప్రిల్‌లో సరళా భట్ హత్యకు గురైంది. ఈ కేసులో యాసిన్ మాలిక్‌పై అభియోగాలు మోపుతూ దర్యాప్తు సంస్థ ఈ ఏడాది జూన్‌లో ఛార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, మాలిక్ దీన్ని ఖండించాడు. ఆ సమయంలో తాను భవనం పైనుంచి పడిపోయి కోమాలో ఉన్నానని, అటువంటి స్థితిలో ఉన్న వ్యక్తి ఎలా హత్యకు ప్రణాళిక రచించగలడని ప్రశ్నించాడు. పైగా.. అప్పట్లో ఈ కేసులో తన పేరును ప్రస్తావించలేదని గుర్తుచేశాడు. ప్రస్తుత ఛార్జిషీట్‌ను రాజకీయ కారణాలతో సృష్టించిన కల్పిత కథగా పేర్కొన్నాడు.

## ఐపీఎస్ అధికారులకు ఊరట.. సస్పెన్షన్ ఎత్తివేత

- విశాల్ గున్ని, కాంతి రాణా టాటా పునర్నియామకం
- కాదంబరి జెత్వాని కేసులో కీలక పరిణామం
- డీజీపీ నివేదిక అనంతరం ప్రభుత్వ నిర్ణయం
- కేబినెట్ ఆమోదంతో ఉత్తర్వులు జారీ





**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 3:** సినీ నటి కాదంబరి జెత్వాని కేసులో సస్పెన్షన్ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారులు విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఊరటనిచ్చింది. ఈ ఇద్దరు అధికారులపై అమలులో ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ, వారిని తక్షణమే విధుల్లోకి పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం పోలీసు వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. కాదంబరి జెత్వాని కేసు నేపథ్యంలో 2024 సెప్టెంబర్‌లో ఈ ఇద్దరు ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కేసు దర్యాప్తు, పరిపాలనా అంశాల పరిశీలన పూర్తయ్యే వరకు వారిపై సస్పెన్షన్ కొనసాగింది. అప్పటి నుంచి ఈ వ్యవహారం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఈ అంశంపై రాష్ట్ర పోలీసు శాఖ సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. డీజీపీ అందించిన నివేదికలోని అంశాలను ప్రభుత్వం సవివరంగా పరిశీలించినట్లు సమాచారం. సస్పెన్షన్‌కు సంబంధించిన నిబంధనలు, సేవా నియమావళి, దర్యాప్తు పురోగతి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అధికా రులపై విధించిన సస్పెన్షన్ గడువు ముగియడంతో పాటు, డీజీపీ నివేదికలో పొందుపరిచిన అంశాల ఆధారంగా ప్రభుత్వం పునర్విమర్శ చేపట్టింది. అనంతరం ఈ విషయాన్ని కేబినెట్ స్థాయిలో చర్చించి తుది నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

దీంతో ఇద్దరు అధికారుల పునర్నియామకానికి మార్గం సుగమమైంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలపై ఉన్న సస్పెన్షన్‌ను అధికారికంగా రద్దు చేశారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడైంది. త్వరలోనే వారికి కొత్త బాధ్యతలు లేదా తగిన పోస్టింగ్‌లు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. ఈ పరిణామం ఆంధ్రప్రదేశ్ పరిపాలనా వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

## జగన్నాథుడి బ్యాంక్ బ్యాలెన్స్ రూ.1912 కోట్లు.. 60,821 ఎకరాల భూమి..!

**రాజధాని వాయిస్** ఒడిశాలోని పూరీ జగన్నాథుడికి వేల కోట్ల రూపాయల ఆస్తులున్నాయి. ఆ ఆలయం పేరిట దేశవ్యాప్తంగా వివిధ జాతీయ బ్యాంకుల్లో ఉన్న ఖాతాల్లో రూ.1,912 కోట్ల డిపాజిట్లు ఉన్నట్లు శ్రీ జగన్నాథ ఆలయ పాలనావిభాగం (ఎస్‌జేటీఏ) ఒక ప్రకటనలో వెల్లడించింది. వాటిలో రూ.1,811 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఉండగా.. మరో రూ.100.71 కోట్లు సేవింగ్స్, కరెంట్ ఖాతాల్లో ఉన్నట్లు తెలిపింది. డిపాజిట్ చేసిన మొత్తంలో రూ.500 కోట్లు ఒడిశా ప్రభుత్వం అందించిన కార్పస్ ఫండ్ అని పేర్కొంది. స్వామివారి పేరిట దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 60,821 ఎకరాల భూమి ఉంది. ఇందులో 60,426 ఎకరాలు ఒడిశాలోనే ఉన్నాయి. ఆలయ రత్నభండార్‌లో బంగారు, వజ్రాల ఆభరణాలు ఉన్నాయి. ఆలయానికి వచ్చే ఆదాయంలో.. భక్తులు ఇచ్చే కానుకలు, ఆలయం పేరిట ఉన్న క్వారీలు, గనుల నుంచి వచ్చే సొమ్ము, డిపాజిట్లపై వడ్డీ, ప్రభుత్వ గ్రాంట్లు, భూవిక్రయాలు భాగమని పాలనా విభాగం పేర్కొంది. "ఈ ఆదాయంలో ఒక భాగాన్ని కార్పస్ ఫండ్‌గా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తాం. ఫౌండేషన్ ఫండ్‌గా ఇంకొంత మొత్తాన్ని జమ చేస్తాం. మిగతా సొమ్మును ఆలయ నిధిగా ఉంచుతాం" అని ఎస్‌జేటీఏ ప్రధాన పాలనాధికారి వెల్లడించారు. ఇక, ఆలయ నిధిని రోజూవారీ ఖర్చుల కోసం వాడుతుంటారు. హుండీ విరాళాలను ప్రతిరో జూ లెక్కిస్తారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు భక్తులు తెలుసుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. అలాగే పూరీ ఆలయం 'సమర్పణ్' పేరిట ఒక డిజిటల్ డొనేషన్ ప్లాట్‌ఫామ్‌ను కూడా నిర్వహిస్తోంది.

# రోడ్డెక్కిన ఉపాధ్యాయులు.. విద్యాభవన్ వద్ద ఉద్రిక్తత..

## - యూటీఎఫ్ నేతల అరెస్ట్

**రాజధాని వాయిస్ గుంటూరు, సెప్టెంబరు 3 :** ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ నేతలు విద్యాభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దాంతో యూటీఎఫ్ లీడర్లు పెద్ద ఎత్తున విద్యాభవన్‌కు చేరుకున్నారు.విద్యాభవన్ ముట్టడికి యత్నించిన టీచర్లను అడ్డుకునేందుకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాంతో పోలీసుల తీరుకు నిరసనగా టీచర్లు ఆందోళన చేస్తున్నారు.ఇన్‌సర్వీస్ టీచర్లు అందరికీ ఒకే క్వాలిఫయింగ్ మార్కులు ఉండాలని, బోధించే సబ్జెక్టులోనే పరీక్ష రాసే విధానం ఉండాలని టీచర్లు కోరుతున్నారు. అదేవిధంగా పరీక్ష కూడా ఆఫ్‌లైన్ విధానంలోనే నిర్వహించాలంటూ యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. యూటీఎఫ్ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునివ్వడంతో విద్యాభవన్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు.పోలీసులు యూటీఎఫ్ నేతలను అదుపు చేసేందుకు విద్యా భవన్‌కు వచ్చే రోడ్డులో బారికేడ్స్ ఏర్పాటు చేశారు. విద్యాభవన్ వద్దకు వస్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. బారికేడ్లను సైతం లెక్కచేయకుండా యూటీఎఫ్ నేతలు విద్యాభవన్ వైపు దూసుకొస్తుండటంతో పోలీసులు కొందరు టీచర్లను అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల దురుసు ప్రవర్తనకు నిరసనగా యూటీఎఫ్ నేతలంతా వడ్డీశ్వరంలోని దీపిక రెస్టారెంట్ వద్ద రోడ్డు మీద కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. రోడ్డు మీద నిరసన తెలుపుతున్న టీచర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు స్టేషన్‌కు తరలించారు. విద్యాభవన్ ముట్టడికి ప్రయత్నించిన ప్రతి ఒక్క యూటీఎఫ్ నేతలను పోలీసులు అడ్డుకుంటున్నారు.గంటల తరబడి యూటీఎఫ్ నేతలు, టీచర్లు రోడ్డుపైనే బైఠాయించి ధర్నా చేశారు. దాదాపు వెయ్యి మంది వరకు ఉపాధ్యాయులు రోడ్లపై బైఠాయించడంతో పోలీసులు పరిస్థితులను అదుపు చేసేందుకు వారందర్నీ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌కు తరలించిన ఉపాధ్యాయుల్ని వెంటనే విడుదల చేయాలంటూ యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.టీచర్ల ఆందోళన ఉధృతంగా మారడంతో విద్యాశాఖ అధికారులు దిగొచ్చారు. యూటీఎఫ్ నేతలను విద్యాశాఖ కమిషనర్ చర్చలకు పిలిచారు. ఒకవైపు చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించినప్పటికీ.. మరోవైపు యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు తమ నిరసన కొనసాగిస్తూనే ఉండటం విశేషం. అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినా అక్కడ కూడా ఆందోళన చేశారు.

# ఏపీ రేషన్ బియ్యంలో 10శాతం నూకలు..

**మార్కెట్లో కిలో రూ.65, రేషన్ షాపుల్లో పూర్తిగా ఉచితం**



**రాజధాని వాయిస్ అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేషన్ బియ్యం పంపిణీలో కీలక మార్పులు చేసింది. ఇకపై రేషన్ బియ్యంలో నూకలు 10 శాతమే మాత్రమే ఉంటాయి. పేదలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని భావించిన ప్రభుత్వం..సెప్టెంబర్ 1 నుంచి 17 జిల్లాల్లో పంపిణీ ప్రారంభించింది.. అక్టోబర్ నెలలో 20 జిల్లాలకు విస్తరించాలని నిర్ణయించారు. నవంబర్ నెల నాటికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 10శాతం నూకలతో రేషన్ బియ్యాన్ని అందించనున్నారు. గతంలో రేషన్ బియ్యంలో 25శాతం నూకలు ఉండగా దానిని 15శాతానికి తగ్గించారు.. ఇప్పుడు 10శాతం నూకలతో పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లలో బియ్యం ధరలు భారీగా పెరిగాయి.. కేజీ రూ.60 నుంచి రూ.70 మధ్యకు చేరాయి. కానీ రేషన్ షాపుల్లో ఇస్తున్న నాణ్యమైన బియ్యం పూర్తిగా ఉచితం. రాష్ట్రంలో 29,844 రేషన్ షాపులు ఉన్నాయి.. మొత్తం 1.49 కోట్ల బియ్యం కార్డులు ఉంటే.. అందులో 4.35 కోట్ల మంది సభ్యులున్నారు. అలాగే రేషన్ షాపుల్లో 10% నూకలతో పంపిణీ చేసే బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్ కూడా ముద్రిస్తున్నారు. ఇప్పటికే రేషన్ షాపులకు 10శాతం నూకలతో బియ్యం పంపించగా.. షాపుల్లో పంపిణీ కూడా మొదలైంది. గతంలో పంపించిన 15శాతం నూకలు ఉన్న బియ్యాన్ని పంపిణీ చేసిన తర్వాత ఇప్పుడు కొత్తగా వచ్చిన 10శాతం నూకలున్న బియ్యాన్ని రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. రేషన్ షాపులకు పంపిస్తున్న ఈ బస్తాలపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే బియ్యం పంపిణీ సమయంలోనూ మరోసారి స్కాన్ చేస్తున్నారు. దీని కోసం ఆర్ఎఫ్ఐడీ పరికరాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్కెట్‌లో ఎక్కువ శాతం స్టీమ్ బియ్యం విక్రయిస్తున్నారు.. అందుకే రేషన్ షాపుల్లో స్టీమ్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే స్టీమ్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు అనుమతి కోరతూ కేంద్రానికి అధికారులు లేఖ రాశారు. కేంద్రం నుంచి అనుమతి వస్తే 10% నూకలతో కూడిన స్టీమ్ బియ్యం పంపిణీ చేయాలని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.35 కోట్లమంది పేదలకు 2.31 లక్షల టన్నుల బియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కిలో బియ్యానికి సగటున రూ.46 వరకు ఖర్చు చేస్తోంది.. కానీ రేషన్ షాపుల్లో బియ్యాన్ని ఎక్కువమంది వ్యాపారులకు విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.. అందుకే రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే బియ్యం మరింత నాణ్యంగా ఉండేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. నూకలు 10 శాతానికి తగ్గించి.. స్టీమ్ రైస్ పంపిణీ చేసే దిశగా అడుగులు వేస్తోంది.

# అభిమాని కోరిక తీర్చిన వైయస్ జగన్



మాట్లాడి ధైర్యం చెప్పారు. వ్యాధితో పోరాడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడవద్దని, ధైర్యంగా చికిత్స కొనసాగించాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌తో కలిసి జగన్ ఫొటో దిగారు. తన అభిమాన నాయకుడితో కలిసి ఫొటో దిగిన క్షణాన్ని విశ్వనాథ్ జీవితంలో మరచిపోలేని అనుభూతిగా అభివర్ణించాడు. కుటుంబ సభ్యులు కూడా జగన్ చూపిన ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘటన అక్కడున్న వారిని కూడా భావోద్వేగానికి గురిచేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న అభిమానిని ప్రత్యేకంగా కలుసుకుని పరామర్శించడం జగన్ మానవీయ కోణాన్ని ప్రతిబింబిస్తోందని వైఎస్ఆర్‌సీపీ నాయకులు పేర్కొన్నా రు. ప్రజల సమస్యల పట్ల, అభిమానుల పట్ల ఆయన ఎప్పుడూ సానుభూతితో వ్యవహరిస్తారని అన్నారు. విశ్వనాథ్‌కు ఇచ్చిన ధైర్యం అతనిలో కొత్త ఆశలు నింపిందని అభిప్రాయపడ్డారు. తన జీవితంలో అత్యంత ఆనందకరమైన రోజు ఇదేనని విశ్వనాథ్ పేర్కొన్నాడు. వైయస్ జగన్‌ను కలవాలన్న తన కోరిక నెరవేరడంతో ఎంతో సంతోషంగా ఉందని చెప్పాడు. తన ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ జగన్ అందించిన భరోసా జీవితాంతం గుర్తుండిపోతుందని తెలిపాడు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

# 31 కీలక అజెండాలకు ఏపీ కేబినెట్ ఆమోదం



అలాగే పొగాకు రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో రూ.94 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు నిర్ణయం తీసుకుంది. మత్స్య రంగ అభివృద్ధికి తోడ్పడే రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ-2026 ముసాయిదాకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాలు కూడా సమావేశంలో తీసుకున్నారు. శాఖమూరులో స్టేట్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గుడ్ గవర్నెన్స్ సంస్థలతో కూడిన 'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.759.79 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేశారు. అమరావతిలో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్ల నిర్మాణం, అమరావతి రైల్వే కనెక్టివిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు పనుల పురోగతిపై కూడా కేబినెట్ చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. సాగునీటి రంగంలో పలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరదల అనంతర పునరుద్ధరణ, సాగునీటి వ్యవస్థల మెరుగుదలకు సంబంధించిన 78 పనులకు రూ.6 కోట్లకు పైగా పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. వెలిగొండ టన్నెల్-2లో టన్నెల్ బోరింగ్ యంత్రం తొలగింపు పనులకు రూ.11.63 కోట్ల నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపారు. కాలువల నిర్వహణ, సాగునీటి హక్కుల అంశాలపై కూడా మంత్రివర్గం చర్చించింది. విద్యుత్ రంగానికి సంబంధించి ఏపీ ట్రాన్స్‌కో మధ్యకాలిక రుణాల కోసం రూ.950 కోట్ల ప్రభుత్వ హామీ ఇవ్వాలని నిర్ణయించారు. సీలేరు కాంప్లెక్స్‌లో ఏపీ జెన్‌కోకు ఫైర్ ప్రికాషనరీ ఫీజు మినహాయింపుకు ఆమోదం తెలిపారు. ఓక్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులో 800 మెగావాట్ల కేటాయింపును రద్దు చేయడం, విండ్-సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టుల సామర్థ్యాల మార్పిడి అంశాలపై కూడా నిర్ణయాలు తీసుకున్నారు. విద్యుత్ సంస్థల రుణాలకు సంబంధించి కార్పొరేట్ గ్యారంటీల అంశాన్ని పరిశీలించారు. పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపులు, మార్కాపురంలో సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం, కడప జిల్లాలో ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై కూడా కేబినెట్ చర్చించి ఆమోదం తెలిపింది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా తీసుకున్న ఈ నిర్ణయాలు రాష్ట్ర ప్రగతికి దోహద పడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# నన్ను బెదిరిస్తే భయపడను



పోతుంటాయి.. గెలుపోటములు సహజం" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

**ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ**

ఈ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వలేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి త్వరగా వంతెన పూర్తిచేసిందని చెప్పారు. తమ ప్రాంత అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధంగా ఉంటారన్నారు. "ఈ ప్రాంతమంతా ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్ సిటీ. పాతబస్తీలో అణువణువూ నాకు తెలుసు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. అది పూర్తయితే పర్యాటకంగా, రవాణాపరంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తిచేశాం. పాతబస్తీ మెట్రోను పూర్తిచేస్తామని చెప్పాం.. చేసి చూపిస్తాం. నాలాలపై ఆక్రమణలను తొలగించి మురుగు సమస్య లేకుండా చేస్తాం. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే.. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ప్రతి నెలా రేషన్‌కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం"అని రేవంత్ అన్నారు.

**రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతు: అసదుద్దీన్** అంతకుముందు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నారు. రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆయన తనదైన పంథాలో పరిపాలన చేయాలన్నారు.

## ఆ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు: సీఎం చంద్రబాబు

**రాజధాని వాయిస్ అమరావతి, సెప్టెంబర్ 3:** సమన్వయ లోపంతో వివిధ కార్యక్రమాలకు ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతుండటంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవటం సరికాదన్నారు. వెలిగొండ, పోలవరం ఎల్ఎంసీ ప్రకటనల్లో మంత్రి రామానాయుడు ఫొటో లేకపోవటాన్ని ఆయన తప్పుబట్టారు. తప్పులు పునరావృతం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెలిగొండ ప్రారంభానికి జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ సమన్వయంతో పని చేశాయన్నారు. రామానాయుడు సింప్లిసిటీ మెయింటైన్ చేస్తూ పని బాగా చేశారంటూ అభినందించారు. దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటు కానుందని.. ఆంధ్ర పాప్ కార్న్, అరకు కాఫీ ప్రతి గ్రామానికి విస్తృతంగా వెళ్లాలని సూచించారు. ఏపీలో ఎల్‌నినో పరిస్థితులను వివరిస్తూ ఈరోజే కేంద్రానికి లేఖ రాయనున్నట్లు సీఎం తెలిపారు. ప్రతినెలా క్షేత్రస్థాయి పరిస్థితులు కేంద్రానికి నివేదిద్దామన్నారు. అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశంలో 70 శాతం మేర లోటు వర్షపాతం ఉందన్నారు. గత 30ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అతి తక్కువ వర్షపాతం ఈసారి నమోదైందని చెప్పారు.

# ఎ.కొండూరుకు స్వచ్ఛ జలాల వరం..



ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. తాగునీటి కొరత, కలుషిత జలాల వినియోగం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రాజెక్టును వేగవంతం చేసి పూర్తి చేయించారు.గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటికీ టెండర్ ప్రక్రియను కూడా ప్రారంభించలేదని అధికారులు తెలిపారు. జల్ జీవన్ మిషన్ గడువు ముగిసే పరిస్థితుల్లో ఉన్న ఈ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన నిధులను సమకూర్చి నిర్మాణ పనులను పూర్తి చేసింది. ఇబ్రహీంపట్నం ఎన్టీపీసీ కాలువ నుంచి కృష్ణా జలాలను సేకరించి శుద్ధి చేసి ప్రజలకు అందించేలా ప్రాజెక్టును రూపొందించారు. 130 కిలోమీటర్ల పైప్‌లైన్, 12 ఎత్తైన నీటి నిల్వ ట్యాంకుల ద్వారా దాదాపు 75 వేల మందికి రోజుకు ఒక్కొక్కరికి 55 లీటర్ల చొప్పున స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖతో పాటు పలు శాఖల సమన్వయంతో పనులను వేగంగా పూర్తి చేశారు.ఇప్పటివరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు శాశ్వత తాగునీటి వసతి కల్పించడంతో ఆ భారం తగ్గడమే కాకుండా ప్రజల ఆరోగ్య పరిస్థితుల్లోనూ మెరుగుదల వస్తుందని అధికారులు భావిస్తున్నారు. కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్న ప్రాంత ప్రజలకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. త్వరలో ఎ.కొండూరు ప్రాంతంలో పర్యటించనున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తాగునీటి పథకం పనుల నాణ్యతను పరిశీలించనున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు పర్యటన ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుందని అధికారులు వెల్లడించారు.

# స్థానిక ఎన్నికలపై లోకేశ్ స్పష్టత..

చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ నెల నుంచి కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని దశలవారీగా ప్రారంభించనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. పింఛన్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రభుత్వం పూర్తిస్థాయి స్పష్టతతో ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని తేల్చిచెప్పారు. ప్రస్తుతం కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా వేగంగా పరిష్కరిస్తోందని వివరించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌ను కూడా లోకేశ్ ఈ సందర్భంగా వివరించారు. ముందుగా పురపాలక సంస్థల ఎన్నికలు నిర్వహించి, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, చివరిగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. అన్ని దశల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో కూటమి బలాన్ని మరింత పెంచే దిశగా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం చురుకుగా వ్యవహరించాలని సూచించారు.స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు రాష్ట్రానికి అందకుండా చేయాలనే ఉద్దేశంతో వైసీపీ 'గొడ్డలి రాజకీయాలు' చేస్తోందని లోకేశ్ విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే రాజకీయ కుయుక్తులు ఎంతమాత్రం ఫలించవని మండిపడ్డారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని, అందుకే కూటమి ప్రభుత్వ కార్యక్రమాలను మరింత సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారం, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే లేదా విధులను సక్రమంగా నిర్వర్తించని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై నమోదైన అక్రమ కేసులు, ఆయన నిర్బంధానికి మూడేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే నీటి కొరతను ముందస్తు ప్రణాళికలు, పొదుపు చర్యల ద్వారా అధిగమించేలా చర్యలు చేపట్టాలని కూడా మంత్రులకు సూచించారు.

# మాక్స్ స్మార్ట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించిన అమిత్ షా

అన్నారు.ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అత్యాధునిక వైద్య సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. మాక్స్ ఆసుపత్రి కొత్త భవనం ద్వారా మరింత మెరుగైన చికిత్సా సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. దేశంలో ఆరోగ్య సేవల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అమిత్ షా తెలిపారు. ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ వైద్య సంస్థలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో భాగస్వామ్య విధానం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు.కొత్త భవనంలో అత్యాధునిక వైద్య పరికరాలు, ప్రత్యేక వైద్య విభాగాలు, అధునాతన చికిత్సా సదుపాయాలు అందుబాటులో ఉండనున్నాయి. దీనివల్ల ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. మాక్స్ ఆసుపత్రి సేవా విస్తరణతో మరింత మంది రోగులు ప్రయోజనం పొందే అవకాశం ఉందని అమిత్ షా ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఇలాంటి సంస్థలు ముందుండి సేవలు అందించడం దేశ ఆరోగ్య రంగ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

# ఏపీలో మరోసారి కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించిన ప్రభుత్వం..

**ఇక వారంతా పర్మినెంట్, 2024 ఏప్రిల్ నుంచి అమలు**

**రాజధాని వాయిస్ పల్నాడు, సెప్టెంబరు 03 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించింది. వైద్య విద్య శాఖ పరిధిలోని బోధనాసుపత్రులు, కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది.ల్యాబ్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్, డైటీషియన్, డార్క్‌రూమ్ అసిస్టెంట్ పోస్టుల్లో ఉన్న 14మంది ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2024 ఏప్రిల్ 1 నుంచి క్రమబద్ధీకరణ అమల్లోకి వచ్చేలా అనుమతి ఇచ్చింది. రెగ్యులర్ పోస్టుల్లో చేరిన తేదీ నుంచి ఆర్థికపరమైన ప్రయోజనాలు వర్తిస్తాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.ఏపీ ప్రభుత్వం రెండు నెలల క్రితం కూడా కొందరు ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించిన సంగతి తెలిసిందే. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించింది. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసీ అధికారులు, ఫార్మసిస్ట్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్( మహిళ), ల్యాబ్ టెక్నీషియన్(మలేరియా), మహిళా నర్సింగ్ హెల్పర్ కేటగిరీలకు చెందిన 23 మంది ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించింది. వీరికి 2024 ఏప్రిల్ 1 నుంచి రెగ్యులరైజేషన్ అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఈ 23మంది ఉద్యోగులు గతంలో సేవా కాలానికి ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు కోరలేరని ప్రభుత్వం తెలిపింది. కాంట్రాక్ట్ నుంచి రెగ్యులర్ అయిన ఈ 23మంది ఉద్యోగులను జూనియర్ మోస్ట్ ఉద్యోగులుగా పరిగణిస్తారని ప్రభుత్వం తెలిపింది. ఈ ఉద్యోగుల డేట్ ఆఫ్ బర్త్, ఎడ్యుకేషన్, టెక్నికల్ అర్హతలు, రిజర్వేషన్ వంటి వివరాలను అధికారులు పరిశీలిస్తారు. ఆ తర్వాతే వీరందని ధ్రువీకరించి నియామక ఉత్తర్వులు జారీ చేస్తారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టంగా తెలియజేసింది. తాజాగా మరో 14మంది ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించింది.మరోవైపు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల తాత్కాలిక కేటాయించింది.

# కృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి: వైఎస్ జగన్



**రాజధాని వాయిస్ తాడేపల్లి :** కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మానవాళికి కర్తవ్యబోధ చేసిన భగవాన్ శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలను ప్రజలంతా ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సందేశంలో శ్రీకృష్ణుని బోధనలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. భగవద్గీత రూపంలో ప్రపంచానికి అమూల్యమైన జ్ఞానాన్ని అందించిన శ్రీకృష్ణుడు ధర్మం, న్యాయం, కర్తవ్యపాలనకు ప్రతీకగా నిలిచారని వైఎస్ జగన్ అన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొంటూ సత్యం, ధర్మం వైపు నిలబడాలని గీతా సందేశం బోధిస్తుందని చెప్పారు. మానవాళికి శాశ్వత స్ఫూర్తిగా నిలిచిన ఆ సందేశాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.మంచి కోసం నిలబడి చెడుపై విజయం సాధించిన శ్రీకృష్ణుని జీవితం సమాజాని కి గొప్ప మార్గనిర్దేశం చేస్తుందని ఆయన అన్నారు. ధర్మాన్ని కాపాడటంలో, బలహీనులకు అండగా నిలవటంలో శ్రీకృష్ణుడు చూపిన మార్గం నేటి తరాలకు కూడా ఆదర్శప్రాయమని వివరించా రు. సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం పెంపొందించుకోవడానికి ఆయన బోధనలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కృష్ణాష్టమి పర్వదినం ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే సందర్భంగా నిలుస్తుందని వైఎస్ జగన్ అన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. ప్రతి ఇంటా ఆనందం, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో ప్రేమ, ఐక్యత, సోదరభావం మరింత పెరగాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంపైనా, ప్రజలందరిపైనా భగవాన్ శ్రీకృష్ణుడి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన శుభాకాంక్షల సందేశంలో అభిలషించారు. కృష్ణాష్టమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని కోరుతూ మరోసారి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టరేట్ నూతన కార్యాలయం ప్రారంభం

- మంగళగిరిలో ఆధునిక సౌకర్యాల పరిశీలన
- మైనింగ్ శాఖలో పారదర్శకతకు ప్రాధాన్యం
- ఇసుక, గనుల అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచన - మంత్రి కొల్లు రవీంద్ర






**రాజధాని వాయిస్ మంగళగిరి, సెప్టెంబర్ 3 :** మంగళగిరి మయూరి టెక్ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టరేట్ కార్యాలయాన్ని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధునిక సౌకర్యాలను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన కెమికల్ ల్యాబ్, కాన్ఫరెన్స్ హాల్, కమాండ్ కంట్రోల్ రూమ్, రికార్డు రూమ్‌తో పాటు మైన్స్ ఎగ్జిబిషన్‌ను మంత్రి పరిశీలించారు. గనుల రంగంలో సాంకేతికత వినియోగం పెంచడం ద్వారా పారదర్శకత, సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. ఆధునిక వసతులతో శాఖ కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన మైనింగ్ అధికారులతో మంత్రి సమావేశమ య్యారు. శాఖ పనితీరు, ఆదాయ వనరులు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ప్రభు త్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఇసుక, గనుల నిర్వహణ అంశాల్లో ప్రజలకు సరైన అవగాహన కల్పించడం అత్యంత అవసరమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గనుల విధానాలు, ఇసుక సరఫరా వ్యవస్థపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ పారదర్శక సమాచారాన్ని అందించాలని అధికారులకు సూచిం చారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు.ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడమే కాకుండా ప్రజలకు మేలు చేసే విధంగా శాఖ కార్యకలాపాలు ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. గనుల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచే యడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని అన్నా రు. రాష్ట్ర అభివృద్ధిలో గనుల శాఖ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంత మైన నిర్వహణతో గనుల రంగాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల సంక్షేమం, ప్రభుత్వ ఆదాయ వృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ శాఖ ముందుకు సాగాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన వైయస్ జగన్

- నూతన వధూవరులు శ్రీయ--జనక్‌లను ఆశీర్వదించిన మాజీ ముఖ్యమంత్రి
- కర్నూలు పర్యటనలో పార్టీ నాయకులతో మమేకం
- సుఖసంతోషాలతో జీవించాలని దంపతులకు ఆకాంక్ష





**రాజధాని వాయిస్ కర్నూలు, సెప్టెంబర్ 3 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు పర్యటనలో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఎస్.వి. మోహన్‌రెడ్డి కుమారుడు జనక్ వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరయ్యారు. కర్నూలులోని సెయింట్ జోసెఫ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించిన ఈ వేడుకలో పాల్గొన్న ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకకు వచ్చిన అతిథులు, పార్టీ నాయకులు జగన్‌కు ఘన స్వాగతం పలికారు.రిసెప్షన్ కార్యక్రమంలో వధూవరులు శ్రీయ--జనక్‌లను కలుసుకున్న వైయస్ జగన్ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆనందమయమైన దాంపత్య జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. కుటుంబబంధాలు, విలువలు కాపాడుకుంటూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహి ంచాలని ఆశీర్వదించారు. వధువు శ్రీయ రాజమండ్రి రుడా మాజీ ఛైర్మన్ షర్మిల, మేడపాటి అనిల్‌రెడ్డి దంపతుల కుమార్తె కాగా, వరుడు జనక్ మాజీ ఎమ్మెల్యే ఎస్.వి. మోహన్‌రెడ్డి కుమారుడు. రెండు కుటుంబాలకు చెందిన బంధువులు, స్నేహితులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఈ వేడుక వైభవంగా జరిగింది. వివాహ రిసెప్షన్ సందర్భంగా అతిథులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.కర్నూలు పర్యటనలో వైయస్ జగన్ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కూడా మమేకమ య్యారు. వివాహ వేడుకకు హాజరైన పార్టీ శ్రేణులు ఆయనను కలిసి అభివాదం చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల తో జగన్ కొద్దిసేపు ముచ్చటించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యకలాపాలపై కూడా చర్చించినట్లు తెలిసింది. వివాహ రిసెప్షన్ కార్యక్రమం రాజకీయ, సామాజిక ప్రముఖుల సందడితో కళకళలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అతిథులు నూతన దంపతులను ఆశీర్వదించారు. వేడుకలో సాంప్రదాయ మరియు ఆధునిక అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ సభ్యులు అతిథులను ఆత్మీయంగా ఆహ్వానిం చి మర్యాదలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భవిష్యత్తు సంతోషకరంగా ఉండాలని ఆకాంక్షించారు. వైయస్ జగన్ హాజరుకావడంతో కార్యక్రమానికి మరింత ప్రాధాన్యం చేకూరిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన నాకాబందీ నిర్వహించిన బాపట్ల పోలీసులు

- ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాలతో ప్రత్యేక తనిఖీలు
- అక్రమ రవాణా, నేర కార్యకలాపాల నియంత్రణే లక్ష్యం
- అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా
- ప్రజల సహకారం కోరిన పోలీసులు





**రాజధాని వాయిస్ బాపట్ల :** జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహే శ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా పోలీసులు గురు వారం జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన నాకాబందీ నిర్వహిం చారు. అక్రమ రవాణా, నేర కార్యకలాపాలను అరికట్టడం, శాంతిభద్రత లను పరిరక్షించడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. నాకాబందీ సందర్భంగా వాహనాల పత్రాలను పరిశీలించడంతో పాటు అనుమానాస్పదంగా సంచరిస్తు న్న వ్యక్తుల వివరాలను సేకరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల కు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచి అవసరమైన సమాచారాన్ని సేకరించారు. అక్రమంగా తరలిస్తున్న వస్తువులు, నిషేధిత సరుకులు, మాదకద్రవ్యాల రవాణాను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్న పోలీసు శాఖ, ఈ నాకాబందీ ద్వారా నేరస్థుల కదలికలను అరికట్టే దిశగా చర్యలు తీసుకుంది. అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు ప్రయాణికుల వివరాలను కూడా పరిశీలిం చారు. అవసరమైన చోట చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులను అప్రమత్తం చేశారు. అక్రమ రవాణా, దొంగతనాలు, మాదకద్రవ్యాల సరఫరా, ఇతర నేర కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు ఎంతో ఉపయోగపడతాయని పోలీసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భద్రతా వలయాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికా రులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల ను కాపాడటంతో పాటు నేరాల నియంత్రణ కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.

# పి-4 కార్యక్రమంతో పేద కుటుంబాలకు స్వయం ఉపాధి సాధనాలు

- గుడ్లవల్లేరులో 115 కుటుంబాలకు రూ.66 లక్షల విలువైన లబ్ధి
- ఆరు బంగారు కుటుంబాలకు ఆటోలు, యంత్ర సామగ్రి పంపిణీ
- పేదల ఆర్థికాభివృద్ధే పి-4 కార్యక్రమం లక్ష్యమన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము





**రాజధాని వాయిస్ గుడ్లవల్లేరు, సెప్టెంబర్ 03 :** గుడ్లవల్లేరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నేతృత్వంలో పి-4 'ఫ్రీ గ్రౌండ్ మీటింగ్ విత్ బంగారు కుటుంబాలు, ఆస్తుల పంపిణీ' కార్యక్రమం నిర్వహించారు. పి-4 ఆరో దశలో భాగంగా రూ.66 లక్షల వ్యయంతో 115 కుటుంబాల కు లబ్ధి చేకూర్చే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా ఆరు బంగారు కుటుంబాలకు వారి నైపుణ్యాలకు అనుగుణంగా స్వయం ఉపాధి కోసం ఆటోలు, వివిధ రకాల యంత్ర సామగ్రిని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపీఎస్‌డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, అధికారులు, కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడిన ఎమ్మెల్యే వెనిగం డ్ల రాము, దాతలు అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తు న్న అవకాశాలను వినియోగించుకుని కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని కోరారు. ఉపాధి సాధనాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటే స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి-4 సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో తొలి అడుగు ఎప్పుడూ కష్టంగానే ఉంటుందని, దారిలేని చోట వేసే తొలి అడుగే భవిష్యత్ తరాలకు మార్గం చూపుతుందని అన్నారు. రాష్ట్రానికి మార్గదర్శకత్వం వహిస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న నాయకుడు ముఖ్యమ ంత్రి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం వినూత్నంగా పి-4 కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. సమాజంలోని ఉన్నత వర్గాలను దాతలుగా ఒక వేదికపైకి తీసుకువచ్చి అవసరమైన పేద కుటుంబాలకు ఉపాధి సాధనాలు అందించే విధంగా వ్యవస్థను రూపొందించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. నైపుణ్యాలు ఉన్నప్పటికీ సరైన అవకాశాలు, మార్గదర్శకత్వం లేక చాలామంది పేదరికంలోనే ఉండిపోతున్నారని పేర్కొన్నారు. అలాంటి కుటుంబాలకు పి-4 కార్యక్రమం ఆశాకిరణంగా నిలుస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమం ద్వారా కేవలం ఉపాధి సాధనాలు అందించడం మాత్రమే కాకుండా, లబ్ధిదారులు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆర్థిక స్వావలంబన సాధించేలా కుటుంబాలను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. పేదరిక నిర్మూలనలో పి-4 కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపా రు. గుడ్లవల్లేరు ప్రాంతానికి చెందిన మేఘా సంస్థ అధినేతలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అదృష్టకరమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మేఘా కృష్ణారెడ్డి కోట్లాది రూపాయలతో మండల అభివృద్ధికి సహకరించడంతో పాటు పి-4 కార్యక్రమం ద్వారా వందలాది కుటుంబాలకు ఉపాధి మార్గాలు చూపుతున్నారని కొనియాడారు. ఇందుకు ప్రభుత్వం, ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని కుటుంబాలకు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# జమ్మలమడుగు అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలి

- మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్న కలెక్టర్
- పట్టణ అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం
- తాగునీరు, విద్యుత్, పారిశుధ్య రంగాలపై సమీక్ష



**రాజధాని వాయిస్ జమ్మలమడుగు, సెప్టెంబర్ 03 :** జమ్మలమడుగు పట్టణాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జమ్మలమడుగు మున్సిపాలిటీ అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జమ్మలమడుగు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రక్రియను వేగవంతం చేసి పట్టణాభివృద్ధికి అవసరమైన చర్యలను సమన్వయంతో అమలు చేయాలని అధికారులకు సూచించారు.అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ, భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటడంతో పాటు ప్రతి మొక్కకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. పట్టణ విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతిపాదించిన రూ.60 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వీధి వ్యాపారులకు అవసరమైన సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.పట్టణంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు, గృహ నిర్మాణం, ప్రజారోగ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

## విద్యార్థులకు హెచ్ఐవీ & ఎయిడ్స్‌పై అవగాహన




**కారంపూడి.సెప్టెంబర్ 03 రాజధాని వాయిస్ :** రీడ్స్ ఆధ్వర్యంలో, ఏపీఎస్ఎసిఎస్ ఇంటెన్సీఫైడ్ ఐఇసి కాంపైన్ లో భాగంగా బ్రహ్మనయుడు హైస్కూల్ లో విద్యార్థులకు హెచ్ఐవీ ఉ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ పద్ధతులు, అపోహలు, హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్ మరియు ఐసిటిసి సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ శేషిరెడ్డి మరియు స్కూల్ సిబ్బంది సహకారం అందించారు. కార్యక్రమంలో పిసిహెచ్ ఎల్టి వెంకటలక్ష్మి, రీడ్స్ మేనేజర్ కోమలి, అవుట్‌రీచ్ వర్కర్ చెన్నమ్మ మరియు పీర్ ఎద్యుకేటర్ ధనలక్ష్మి మరియు కుమారి పాల్గొన్నారు.

## కారంపూడి హిందూ స్మశాన వాటిక వాచ్ మెన్‌కు ఆర్థిక సహాయం చేసిన ఆర్యవైశ్యులు



**కారంపూడి.సెప్టెంబర్ 03రాజదాని వాయిస్ :** పట్టణం లోని హిందూ స్మశాన వాటికలో పనిచేస్తున్న వాచ్ మెన్ భార్యకు రెండు కిడ్నీలు ఇన్ఫెక్షన్ వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు వాచ్మెన్ ఆర్యవైశ్యులకు తెలియజేశారు. అనంతరం ఆర్యవైశ్యులు తన కుటుంబానికి 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు సురే అంకారావు, చీతిరాల వెంకట కోటేశ్వరరావు, మద్దు హనుమంతరావు, ఎస్విఆర్ కృష్ణ, భవిరిశెట్టి పూర్ణచంద్రరావు, ఆతుకూరి గోపి, చలవాది మాధవ్,ఊటుకూరి రాము, యక్కల శ్రీను, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు సముద్రాల పవన్ సాయి, చేపూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన చిన్నారులు



**పిడుగురాళ్ల.సెప్టెంబర్ 03 రాజధాని వాయిస్:** పట్టణంలోని మాంటెస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా గోపికల వేషధారణల్లో అలరించారు. ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది ముస్లిం కుటుంబాలకు చెందిన చిన్నారులు సైతం కృష్ణుడు, రాధ వేషాలు ధరించి వేడుకల్లో పాల్గొనడం.మతాలు వేరైనా మనసులు ఒక్కటేనని, పండుగలు వేరైనా ఆనందం అందరిదీ ఒకటేనని ఈ చిన్నారులు చాటి చెప్పారు. ఒకరి పండుగను మరొకరు గౌరవిస్తూ, సంస్కృతులను పంచుకుంటూ, ప్రేమతో కలిసి జరుపుకోవడమే నిజమైన భారతీయత.చిన్నారుల వేషధారణ చూసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే మత సామరస్యం, సోదర భావం, పరస్పర గౌరవం వంటి విలువలను పిల్లల్లో పెంపొందించడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

# ప్రభుత్వ పథకాల అమలుపై జాయింట్ కలెక్టర్ సమీక్ష

- ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనాలు అందేలా చర్యలు
- సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి



**రాజధాని వాయిస్ గుంటూరు:** ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అందే సేవల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజలతో వ్యవహరించే ప్రతి ఉద్యోగి మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా వారి సమస్యలను ఓర్పుతో విని పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని గుర్తుచేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతి సమస్యను సున్నితంగా పరిగణించి త్వరితగతిన పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను నిర్లక్ష్యం చేయకుండా వాటిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రభుత్వ సేవలను అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించవచ్చని జాయింట్ కలెక్టర్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు అందే ప్రతి సేవలో నాణ్యత, సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సేవల మెరుగుదల, సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి: వడ్డీ రఘురామ్ నాయుడు

- పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగించాలని సూచన
- ప్రతి ఇంటికీ పార్టీ కార్యక్రమాలను తీసుకెళ్లాలని పిలుపు
- పెంటపాడులో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల సమావేశం



**రాజధాని వాయిస్: తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 3 :** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పెంటపాడు మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురామ్ నాయుడు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అని అన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పోరాడాలని కోరారు. ప్రజా సమస్యలపై పార్టీ తరపున గళం వినిపించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్త పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రఘురామ్ నాయుడు సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వం పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించేలా కృషి చేయాలని కోరారు. ఎన్నికల సమయానికి కాకుండా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగితేనే విజయాలు సాధించగలమని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేస్తూ యువత, మహిళలను మరింతగా పార్టీలో భాగస్వాములను చేయాలని అన్నారు. పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం పార్టీ ఎప్పుడూ పోరాట పంథానే అనుసరిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల మరియు పట్టణ స్థాయి పార్టీ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని సమావేశంలో ప్రతిజ్ఞ చేశారు. పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమావేశం కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు నాయకులు తెలిపారు.

# మాదకద్రవ్యాలపై అవగాహన

- వడమాలపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం
- గంజాయి, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టాలపై అవగాహన
- విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచన

**రాజధాని వాయిస్ వడమాలపేట, సెప్టెంబర్ 3 :** వడమాలపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వడమాలపేట ఎస్ఐ ఆధ్వర్యంలో ఈగిల్ టీమ్ సభ్యులు పాల్గొని విద్యార్థులకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని అధికారులు తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైతే కుటుంబాలతో పాటు సమాజం కూడా నష్టపోతుందని పేర్కొన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు.ఈవ్ టీజింగ్ వంటి వేధింపులు చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని అధికారులు వివరించారు. మహిళలు, బాలికల పట్ల గౌరవప్రదంగా వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. పోక్సో చట్టం (పిల్లలపై లైంగిక నేరాల నిరోధక చట్టం) గురించి కూడా అవగాహన కల్పించారు. పిల్లల భద్రత కోసం రూపొందించిన ఈ చట్టంలోని ముఖ్య అంశాలను వివరించి, ఏవైనా వేధింపులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు.సామాజిక మాధ్యమాల వినియోగంలో కూడా జాగ్రత్తలు పాటించాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు.

## వీధి నాటకాలతో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన







**చిలకలూరిపేట.సెప్టెంబర్ 03 రాజధాని వాయిస్ :**పల్నాడు జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ సహకారంతో స్థానిక క్యాంప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై వీధి నాటకాల ద్వారా అవగాహన కల్పించారు. కళామందిర్, గణపవరం, ఎన్ఆర్టీ, బొడ్రాయి సెంటర్లలో మిరియాల శ్రీనివాసరావు కళాజాత బృందం ప్రదర్శనలు నిర్వహించింది. వ్యాధి నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలు, కండోమ్ వినియోగం, సుఖవ్యాధులు-క్షయ చికిత్సలతో పాటు ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపరాదని, ఎయిడ్స్ చట్టం-2017 నిబంధనలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కొండా పవన్ కళ్యాణ్, ఏఎన్ఎం ఊహ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు మంత్రి లోకేష్‌కు ఆహ్వానం



**ఉండవల్లి.సెప్టెంబర్ 03 రాజధాని వాయిస్ :** చిత్తూరు జిల్లాలోని ప్రసిద్ధ కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఈ నెల 14 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కు ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఛైర్మన్ సురేంద్రబాబు ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్ ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు మంత్రి లోకేష్ కు వేదాశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## మాచర్లలో వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం మైనారిటీ నేతలు



**మాచర్ల. సెప్టెంబర్ 03రాజధాని వాయిస్:** పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్థానిక ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ జబ్బార్, షేక్ ఉమర్‌లు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పిన్నెల్లి మాట్లాడుతూ,పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, అందరూసమన్వయ ంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పరామర్శ



**చిలకలూరిపేట.సెప్టెంబర్ 03 రాజధాని వాయిస్ :**చిలకలూరిపేట మున్సిపాలిటీ మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ భక్షు మేస్త్రి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో, విషయం తెలుసుకున్న మాజీ మంత్రి విడదల రజిని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా భక్షు మేస్త్రి త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా జీవితంలోకి తిరిగి రావాలని విడదల రజిని ఆకాంక్షించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com